# పెరుగుతున్న ఉష్ణోగ్రతలు

- జిల్లాలో 37 డిగ్రీలకు చేరిన ఉష్ణోగ్రత
- అప్రమత్తంగా ఉండాలంటున్న వైద్యులు

నంద్యాల(రూరల్): ఉష్ణోగ్రతలు క్రమంగా పెరుగుతున్నాయి. రాత్రి కొంతమేర చలి ఉంటున్నా ఉదయం వేళల్లో భానుడు విజృంభిస్తున్నాడు. ముఖ్యంగా మధ్యాహ్న సమయంలో ఎండ తీవ్రత పెరిగింది. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు. ఈ నెల 11వ తేదీ నుంచి నంద్యాల జిల్లాలో నమోదైన ఉష్ణోగ్రతలను పరిశీలిస్తే 36, 37, 38, 38, 36, 37 క్రమంగా ఉష్ణోగ్రతలు పెరుగుతుండటాన్ని గమనించవచ్చు. గురువారం పగటి ఉష్ణోగ్రత 37 డిగ్రీలుగా నమోదైంది. కాగా ఈనెల 23వ తేదీ నాటికి 40 డిగ్రీలకు చేరుకునే అవకాశముందని నిపుణులు పేర్కొంటున్నారు.

**జాగ్రత్తలు పాటించాల్సిందే..**

వేసవిలో సాధారణంగా అతిసార ఎక్కువగా ప్రబలుతుంది. ఇందుకు నివారణ.. సురక్షితమైన నీటిని మాత్రమే తాగాలి. బావులు, బోర్లు, చెరువు, కాల్వ నీటిలో క్లోరిన్ కలిపిన తర్వాతనే ఉపయోగించాలి. వాంతులు, నీళ్ల విరేచనాలు అవుతుంటే ఓఆర్ఎస్ ద్రావణాన్ని తాగించాలి. ఇంట్లో లభించే గంజి, పలచని మజ్జిగ, కొబ్బరి నీళ్లు తాగించాలి. పిల్లలకు విరేచనాలు అయితే తల్లి పాలు ఇస్తూనే ఉండాలి. వంట గదిలో ఆహార పదార్థాలు, కోసిన పండ్లు, కూరగాయల ముక్కలపై దుమ్ము, ధూళీ, ఈగలు వాలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. పరిసరాలతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి.



ఎండ తీవ్ర ఎక్కువగా ఉండటంతో నిర్మానుష్యంగా సాయిబాబానగర్-రైల్వేస్టేషన్ రహదారి

**వడదెబ్బ లక్షణాలు..**

ఎండలో అధికంగా తిరగడం,అధిక ఉష్ణోగ్రతల కారణంగా వడదెబ్బ సోకుతుంది. తలనొప్పి, తల తిరగడం, ఎండిపోయిన చర్మంతో ఎక్కువ జ్వరం కలిగి ఉండటం ,ఫిట్స్, మానసిక ప్రవర్తన, చమట, వికారం, ఎర్రబడిన చర్మం, వేగవంతమైన శ్వాస, పాక్షిక అపస్మారక స్థితిలోకి వెళ్లడం తదితర లక్షణాలు ఉంటాయి.ఎండలో బయట తిరాగాల్సి వస్తే ద్రవ పదార్థాలను అధికంగా తీసుకోవాలి. ఉష్ణోగత్ర నుంచి ఉపశమనం కలిగించే చర్యలు పాటించాలి. తేలికపాటి, నూలు దుస్తులు ధరించాలి.

**ఈ జాగ్రత్తలు తప్పని సరి..**

సాధ్యమైనంత వరకు మధ్యాహ్నం ఎండలో తిరగకూడదు. తప్పనిసరిగా బయటకు వెళ్లాల్సి వస్తే ఉప్పు కలిపిన మజ్జిగ,పండ్ల రసాలు తాగాలి. తెల్లని దుస్తులు ధరించాలి. వేసవిలో మద్యం తాగడం వల్ల రక్తనాళాలు వ్యాకోచించి ఎక్కువ చమటలు వచ్చేలా చేస్తాయి. అది విషమ పరిస్థితికి దారి తీస్తుంది. ఇంటి ఉష్ణోగ్రతలు తగ్గించేందుకు కిటికీలు, తలుపులు తెరవాలి.

### పిల్లలను ఎండలో తిరగనివ్వరాదు

ఉష్ణోగ్రతలు రోజు రోజుకు పెరుగుతున్నాయి. ప్రజలు జాగ్రత్తలు పాటించాలి. శరీరానికి గాలి తగిలే దుస్తులు వాడాలి. రోజుకు అవసరాన్ని బట్టి పెద్దలు 6 నుంచి 8 లీటర్ల నీటిని తీసుకోవాలి. పిల్లలను ఎండలో ఆడకుండా చూడాలి. బయటి ఆహారాన్ని తీసుకోకపోవడం మంచిది.

–డాక్టర్ వెంకటరమణ,
డీఎంఅండ్‌హెచ్‌ఓ, నంద్యాల

## క్లుప్తంగా

### అహోబిలేశుడికి ప్రత్యేక పూజలు



చిలుకలూరులో పూజలందుకున్న ఉత్సవమూర్తులు

రుద్రవరం: మండలంలోని చిలుకలూరులో అహోబిలేశుడి పార్వేటపల్లకీ కొలువుదీరడంతో ఉత్సవమూర్తులు శ్రీ జ్వాలా నరసింహ స్వామి, ప్రహ్లాదవరద స్వామి వారికి గురువారం గ్రామస్తులు ప్రత్యేక పూజలు చేశారు. పార్వేట ఉత్సవాల్లో భాగంగా స్వామి వారి పల్లకీ మందలూరు నుంచి చిలుకలూరుకు చేరుకుంది. గ్రామ పెద్దలు పొలిమేర వరకు ఎదురేగి స్వామి వార్లకు ఘన స్వాగతం పలికారు. అనంతరం గ్రామంలోని పలు తెలుపుల మీద కొలువు దీరగా ప్రజలు భక్తి శ్రద్ధలతో పూజలు చేశారు. రాత్రి స్వామి వారి పల్లకీ తిప్పారెడ్డి పల్లె చేరుకుంది.

### పాడి రైతుల అభివృద్ధే లక్ష్యం



పాడి రైతుకు చెక్కు అందజేస్తున్న ఎస్పీ జగన్‌మోహన్‌రెడ్డి

నంద్యాల(అర్బన్): పాడి రైతుల అభివృద్ధే విజయ డెయిరీ లక్ష్యమని చైర్మన్ ఎస్వీ జగన్ మోహన్‌రెడ్డి తెలిపారు. పాడి పశువుల కొనుగోలు, క్షీరబంధు పథకం ద్వారా మృతి చెందిన కుటుంబాలకు ఆర్థికసాయం, పశుగ్రాస క్షేత్రాల పెంపకానికి సహకారం వంటి నిర్ణయాలతో పాడి రైతుల సంక్షేమానికి కృషి చేస్తున్నామని చెప్పారు. స్థానిక డెయిరీ ఆవరణలో గురువారం పలు రైతు కుటుంబాలకు ఆర్థిక సహాయం అందించే కార్యక్రమాలు నిర్వహించారు. ఇటీవల ప్రమాద వశాత్తు మృతి చెందిన యర్రగుంట్ల గ్రామానికి చెందిన పాడి రైతు రంగన్న కుటుంబానికి రూ.50వేల చెక్కును అందజేశారు. అనంతరం పశువుల కొనుగోళ్లకు సంబంధించి 26మంది రైతులకు 20శాతం సబ్సిడీతో రూ.3.56లక్షలు, పశుగ్రాస క్షేత్రాల సాగుకు ఎకరాకు రూ.5వేలు చొప్పున 130 ఎకరాలు, 180 మంది పాడి రైతులకు రూ.6.57 లక్షలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎండీ పరమేశ్వరరెడ్డి, ఓఎస్‌డీ ప్రదీప్, డీడీ రాజేష్, మేనేజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

### త్వరలో శనగ కొనుగోలు కేంద్రాలు

నంద్యాల(అర్బన్): మండలంలో త్వరలో శనగల కొనుగోలు కేంద్రాలు ప్రారంభించనున్నట్లు మండల వ్యవసాయాధికారిణి స్వప్నికా రెడ్డి తెలిపారు. పులిమద్ది గ్రామ ఆర్‌బీకేలో జరుగుతున్న శనగల కొనుగోలుకు సంబంధించి రైతుల రిజిస్ట్రేషన్‌ను గురువారం పరిశీలించారు. ఏఓ మాట్లాడుతూ మార్క్‌ఫెడ్ ద్వారా క్వింటా రూ.5,335 మద్దతు ధరతో శనగలు కొనుగోలు చేస్తామని చెప్పారు. ఈ -క్రాప్‌లో శనగ పంట నమోదు చేయించుకున్న రైతులు మాత్రమే రిజిస్ట్రేషన్ చేయించుకునేందుకు అర్హులన్నారు. వన్‌బీ, ఆధార్ కార్డుతో ఆర్‌బీకేల్లోని వ్యవసాయ సిబ్బందిని సంప్రదించి ఈనెల 23వ తేదీ లోపు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు.

### పౌష్టికాహారం పంపిణీ

ఉయ్యాలవాడ: వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకంలో భాగంగా అంగన్‌వాడీ కేంద్రాలకు రాలేని గర్భిణులు, బాలింతలను గుర్తించి పౌష్టికాహారాన్ని అందజేసే కార్యక్రమాన్ని మండలంలోని రూపనగుడి గ్రామంలో గురువారం చేపట్టారు. వైఎస్సార్ క్రాంతి పథం ఏపీఎం శేఖర్ మాట్లాడుతూ వైఎస్సార్ అమృత హస్తం, మధ్యాహ్న భోజన పథకం, బాలామృతం, వైఎస్సార్ బాలసంజీవని పథకాలు ప్రభుత్వం అమలు చేస్తోదన్నారు. ప్రసవం జరిగి ఒకటి రెండు నెలలు గడిచిన బాలింతలు, నెలలు నిండి కేంద్రాలకు రాలేని గర్భిణులు, అనారోగ్యంతో ఉండి కేంద్రాలకు రాలేకపోతున్న వారిని ప్రభుత్వం వారి ఇంటి వద్దకే పౌష్టికాహారాన్ని అందజేస్తుందని చెప్పారు. ఆయా గ్రామాల పరిధిలోని లబ్ధిదారులకు ఆరు రకాల ఆహార ధాన్యాలు, కేజీ జొన్న పిండి, కేజీ రాగిపిండి, కేజీ అటుకులు, 250 గ్రాముల ఎండు కర్జూరాలు, 250 గ్రాముల చెక్కీలు, 250 గ్రాముల బెల్లం అందజేశారు.

### ఎరువుల నాణ్యత పరిశీలన

దొర్నిపాడు: రసాయన ఎరువుల నాణ్యతను మండల వ్యవసాయాధికారి శ్రీకృష్ణ గురువారం పరిశీలించారు. మండలకేంద్రంలోని ఎరువుల దుకాణాలను తనిఖీ చేసిన ఆయన 14-35-14, 20:20:0:13, 10:26:26 రకం ఎరువుల నమూనాలను సేకరించి ప్రయోగశాలకు పంపిస్తున్నట్లు చెప్పారు. దుకాణాదారులు నాణ్యమైన ఎరువులు, విత్తనాలు రైతులకు విక్రయించాలని సూచించారు.

### 23న వాహన వేలం

నంద్యాల(అర్బన్): స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలకు చెందిన వ్యాన్‌ను స్క్రాప్‌గా వేలం వేస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసప్రసాద్ తెలిపారు. ఏడీక్యూ 5889 నంబరు గల వ్యాన్ వేలంను ఈనెల 23వ తేదీన నిర్వహిస్తున్నామని, పాల్గొనే వారు కళాశాలలో హాజరు కావాలన్నారు. వివరాలకు సెల్: 9912342021 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

### పంచలోహ విగ్రహాలకు ప్రత్యేక పూజలు



గంగుల మనోహర్‌రెడ్డిని సత్కరిస్తున్న దృశ్యం

రుద్రవరం: మండలంలోని పేరూరు ఆలయంలో వివిధ దేవతామూర్తుల పంచలోహ విగ్రహాలకు గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు.గ్రామ పెద్దల ఆధ్వర్యంలో పండితుల వేద మంత్రోచ్ఛారణలతో శివపార్వతులు, సీతారాముడు పంచలోహ విగ్రహాలకు పూజలు చేశారు. కార్యక్రమంలో పుట్టాలమ్మ క్షేత్ర చైర్మన్ గంగుల మనోహర్‌రెడ్డి పాల్గొన్నారు. అనంతరం ఆలయ నిర్వాహకులు ఆయనను సత్కరించారు. సహకార సంఘం డైరెక్టర్ గోపిరెడ్డి పుల్లారెడ్డి,తిరుపతిరెడ్డి ఉన్నారు.

## అహోబిలం బ్రహ్మోత్సవాలను విజయవంతం చేద్దాం



వివిధ శాఖల అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ శ్రీనివాసులు

ఆళ్లగడ్డ: అహోబిల వార్షిక బ్రహ్మోత్సవాలను విజయవంతం చేసేందుకు అన్ని శాఖల అధికారులు అహోబిలం దేవస్థాన నిర్వాహకులతో సమన్వయం చేసుకోవాలని నంద్యాల ఆర్డీఓ శ్రీనివాసులు తెలిపారు. బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో గురువారం వివిధశాఖల అధికారులతో సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ భక్తులను దృష్టిలో ఉంచుకుని అదనపు బస్సులు నడపాలని ఆర్టీసీ అధికారులకు సూచించారు. వైద్యశిబిరాలు ఏర్పాటు చేసి అవసరమైన మందులు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. అహోబిలం దేవస్థాన నిర్వాహకులు బ్రహ్మోత్సవాల్లో విధులు నిర్వహించేందుకు వచ్చే ప్రభుత్వ అధికారులు, సిబ్బందికి కావలసిన వసతులు, సౌకర్యాలు కల్పించాలని చెప్పారు. కార్యక్రమంలో అహోబిలం మఠం జీపీఏ సంపత్, తహసీల్దార్ హరినాథరావు, సీఐ సుధాకర్‌రెడ్డి, ఎంపీడీఓ సుబ్బారెడ్డి, ఆర్టీసీ డీఎం రాజశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

## అన్నదాతలకు అండగా వైఎస్సార్ అగ్రి ల్యాబ్స్



ఆళ్లగడ్డ ల్యాబ్‌ను తనిఖీ చేస్తున్న మల్లికార్జునయ్య

ఆళ్లగడ్డ: నకిలీల బారిన పడి ఏటా వేల కోట్ల రూపాయల పెట్టుబడిని కోల్పోతున్న అన్నదాలకు అండగా నిలిచెందుకే రాష్ట్ర ప్రభుత్వం వైఎస్సార్ అగ్రి టెస్టింగ్ ల్యాబ్‌లను ఏర్పాటు చేసిందని ప్రాంతీయ కోడింగ్ సెంటర్ వ్యవసాయ ఉప సంచాలకులు మల్లికార్జునయ్య తెలిపారు. స్థానిక వైఎస్సార్ అగ్రి టెస్టింగ్ ల్యాబ్‌ను గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో మరే రాష్ట్రాల్లోనూ లేని రీతిలో నియోజకవర్గానికి ఒకటి చొప్పున ల్యాబ్‌లను ఏర్పాటు చేశారన్నారు. రాయలసీమ ప్రాంతంలోని 8 జిల్లాల్లో 48 ల్యాబ్‌లు మంజూరు కాగా.. అందులో మొదటి విడతగా 24 రైతులకు అందుబాటులో ఉన్నాయని, మిగిలిన 24 ఈ నెల 25న ప్రారంభించేదుకు సిద్ధం చేశామని చెప్పారు. ఇప్పటి వరకు సుమారు ఎరువులు, విత్తనాలు, పురుగు మందులు ఒక్కోటి సుమారు 15 వేల శ్యాంపిళ్లు పరీక్షించామని వివరించారు. ఏడీఏ రామ్మోహన్‌రెడ్డి, ల్యాబ్ అనలిస్టు నాగేంద్రప్రసాద్ ఉన్నారు.

## విద్యార్థుల హాజరు మేరకే మధ్యాహ్న భోజనం



విద్యార్థిని అభ్యసన సామర్థ్యాన్ని పరిశీలిస్తున్న డీఈఓ అనురాధ

గోస్పాడు: విద్యార్థుల హాజరు మేరకే మధ్యాహ్న భోజన పథకాన్ని అందించాలని డీఈఓ అనురాధ తెలిపారు. గురువారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఎంపీపీ పసురపాడు స్కూల్‌ను అకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం నిర్వహిస్తున్న తీరు, విద్యార్థుల హాజరు శాతానికి, మీల్ టోకెన్‌కు తేడాను గుర్తించి ప్రధానోపాధ్యాయుడి పర్యవేక్షణలో లోపాలు ఉన్నట్లు గుర్తించి షోకాజ్ నోటీసు జారీ చేశారు. ఎస్ఏ-1 మార్కులు ఆన్‌లైన్ నమోదు తప్పనిసరిగా చేయాలని సూచించారు. అనంతరం పదో తరగతి విద్యార్థులను కలిసి కష్టపడి చదవాలని చెప్పారు. పాఠశాలలో పోస్టు బాక్స్‌లు వెంటనే ఏర్పాటు చేయాలని ఆదేశించారు. విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పరీక్షించారు. చివరగా విద్యార్థులతో పాటు మధ్యాహ్న భోజనాన్ని రుచి చూశారు. ఎంఈఓ అబ్దుల్‌కరీం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### సైన్స్ ఫేర్‌లో విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

ఆళ్లగడ్డ: ఈ నెల 14న నంద్యాలలో జరిగిన జిల్లా స్థాయి సైన్స్ ఫేర్‌లో చాగలమర్రి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ చాటి ద్వితీయ స్థానంలో నిలిచారు. పోటీల్లో ఏటీఎల్ విభాగంలో 'ఫైర్ పెయింటింగ్ రోబోట్' అనే అంశంలో అద్భుత ప్రదర్శన చేయడంతో రెండో స్థానం దక్కింది. గురువారం విద్యార్థులను హెచ్ఎం కోటయ్య, ఉపాధ్యాయులు అభినందించారు.

## చెస్ విజేతలకు బహుమతుల ప్రదానం



విజేతలతో నిర్వాహకులు

నంద్యాల(అర్బన్): స్థానిక వివేకానంద ఆడిటోరియంలో నిర్వహించిన నంద్యాల జిల్లాస్థాయి 19 ఏళ్ల లోపు బాల బాలికల చెస్ పోటీల విజేతలకు గురువారం బహుమతులు ప్రదానం చేశారు. ఆంధ్రా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో, ఆల్ కర్నూలు చెస్ అసోసియేషన్ నిర్వహణలో నిర్వహించిన పోటీల విజేతలకు ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ రవికృష్ణ, ప్రిన్సిపాల్ సుబ్బయ్య, రత్నకుమార్ ట్రోఫీలు, పతకాలు అందజేశారు. బాలికల విభాగంలో ఆళ్లగడ్డకు చెందిన రిషితబాయి, భారతి, నంద్యాలకు చెందిన చాహత్ ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. నాల్గవ స్థానంలో వెలుగోడుకు చెందిన దీక్షశ్రీ దక్కించుకుంది. బాలుర విభాగంలో వరుసగా నంద్యాలకు చెందిన హర్షవర్ధనాచారి, ఆళ్లగడ్డకు చెందిన జ్యోతిష్‌రెడ్డి, మాన్విత్‌నాయక్ ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించగా, నాల్గవ స్థానంలో మహమ్మద్ ఫరహాన్ నిలిచారు. కార్యక్రమంలో రాష్ట్ర చెస్ అసోసియేషన్ సంయుక్త కార్యదర్శి రామసుబ్బారెడ్డి, ఆర్బిటర్లు ఇమామ్, సుజాత పాల్గొన్నారు.

## ఓపెన్‌డే విజయవంతం



విద్యార్థులకు ల్యాబ్‌లో ప్రయోగాల గురించి వివరిస్తున్న అధ్యాపకురాలు

శిరివెళ్ల: యర్రగుంట్ల జీటీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం జరిగిన ఓపెన్‌డే విజమవంతమైంది. జూనియర్ కళాశాల, మోడల్ స్కూల్, దీబగుంట్ల జూనియర్ కళాశాలతో పాటు ప్రైవేట్ కళాశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. కళాశాలలోని సదుపాయాలు, ప్రయోగశాల, జేకే నాలెడ్జి సెంటర్, విద్యా ప్రమాణాలను అధ్యాపకులు విద్యార్థులకు వివరించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ ఉన్నత విద్యా మండలి కమిషనర్ ఆదేశాల మేరకు కార్యక్రమం నిర్వహించామన్నారు. గ్రామీణ ప్రాంతాల విద్యార్థుల కోసం తమ కళాశాల ఏర్పాటు చేశారని, విద్య, క్రీడల పరంగా ముందంజలో ఉందని చెప్పారు. జేకే నాలెడ్జి సెంటర్ ద్వారా విద్యార్థులకు ఉపాధి అవకాశాల కోసం తర్ఫీదు ఇస్తున్నామన్నారు. అలాగే వృత్తి విద్యా కోర్సుల్లో కూడా శిక్షణ ఇస్తున్నామని వివరించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

# ఉగాది నాటికి గృహ ప్రవేశాలు

- జిల్లాలో జగనన్న కాలనీల్లో 18వేల ఇళ్లు ప్రారంభించాలని లక్ష్యం
- ఇప్పటికే 13,522 ఇళ్ల నిర్మాణాలు పూర్తి
- మరో 3,035 తుది దశకు
- నెరవేరనున్న పేదల సొంతింటి కల

శిరివెళ్ల: నవరత్నాలు– పేదలందరికీ ఇళ్ల నినాదంతో ప్రభుత్వం పక్కా గృహాల నిర్మాణాలకు పూనుకుంది. అధికారంలోకి వచ్చిన ఏడాదికే స్థలం లేని వారికి ఇంటి స్థలం మంజూరు చేసి గృహ నిర్మాణాలకు జగనన్న కాలనీల ఏర్పాటుకు చర్యలు తీసుకుంది. ఇందులో నంద్యాల జిల్లాలో 26,205 పేదలకు పక్కా గృహాలను మంజూరు చేసింది. ఇళ్ల నిర్మాణాలకు అనుమతులివ్వడంతో ప్రస్తుతం భారీగా ఇళ్ల నిర్మాణాలు జరుగుతున్నాయి. మంజూరైన వాటిలో ఇప్పటి వరకు 14,458 ఇళ్లు పూర్తియయ్యాయి. 2,035 ఇళ్లు పైకప్పు పడ్డాయి. మరో 2,634 ఇళ్లు పైకప్పు దశలో ఉన్నాయి. అయితే ఉగాది నాటికి జిల్లాలో 18 వేల గృహ ప్రవేశాలు చేయాలని అధికారులకు లక్ష్యంగా నిర్దేశించింది. ఈ మేరకు అధికారులు లబ్ధిదారులకు అవగాహన కల్పించి నిర్మాణాలు త్వరగా పూర్తయ్యేలా చర్యలు చేపడుతున్నారు. కాగా దశల వారీగా లబ్ధిదారులకు రూ. 405.95 కోట్ల బిల్లులను ప్రభుత్వం చెల్లించింది.

పేదోడి సొంతింటి కల సాకారానికి ప్రభుత్వం కృషి చేస్తోంది. ప్రస్తుతం ఇళ్ల నిర్మాణాలు వేగంగా సాగుతున్నాయి. ఉగాది నాటికి నంద్యాల జిల్లాలో 18వేల గృహ ప్రవేశాలు చేపట్టాలని అధికారులకు లక్ష్యంగా నిర్దేశించింది. నిర్మాణాలు చేపడుతున్న వారికి దశల వారీగా బిల్లులు ఎప్పటికప్పుడు చెల్లిస్తుంది. కాగా ఇప్పటికే జిల్లాలో వివిధ ప్రాంతాల్లో 14,458 ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయి. మిగిలిన వాటిని పూర్తి చేయించాలని యంత్రాంగం చర్యలు ముమ్మరం చేసింది.




యర్రగుంట్ల జగనన్న కాలనీలో నిర్మాణం పూర్తయిన ఇల్లు, తుది దశకు చేరుకున్న ఇంటి నిర్మాణం

### నియోజకవర్గాల వారీగా మంజూరైన ఇళ్లు, పూర్తయినవి..

| నియోజకవర్గం | మంజూరు | పూర్తి |
|---|---|---|
| నంద్యాల | 5,654 | 3,006 |
| ఆళ్లగడ్డ | 13,040 | 2,979 |
| శ్రీశైలం | 10,515 | 2,442 |
| పాణ్యం | 1,736 | 348 |
| బనగానపల్లె | 7,172 | 858 |
| డోన్ | 13,322 | 2,183 |
| నందికొట్కూర్ | 7,753 | 1,708 |

### డివిజన్ల వారిగా సమీక్ష



ఉగాది నాటికి జిల్లాలో 18 వేల గృహ ప్రవేశాలు జరగాలని ప్రభుత్వ లక్ష్యం నిర్దేశించింది. లక్ష్య సాధనకు డివిజన్, నియోజక వర్గాలు, మండలాల వారీగా కలెక్టర్ సమీక్ష చేస్తున్నారు. పురోగతిలో వెనుకబడిన మండలాలకు ప్రత్యేక అధికారులను నియమిస్తున్నారు. తుది దశకు చేరుకొన్న ఇళ్ల నిర్మాణాలు త్వరగా పూర్తియయ్యేలా చూస్తున్నాం.లబ్ధిదారులకు అవగాహన కల్పిస్తున్నాం.

– మాధవరావు ఈఈ

### ఓటర్ల జాబితా ప్రదర్శన

శిరివెళ్ల: స్థానిక సంస్థల ఎన్నికలకు మండలంలో 18 మంది (ఎంపీటీసీలు, జెడ్పీటీసీ) ఓటర్లున్నారని ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం గురువారం తెలిపారు. స్థానిక సంస్థల కోటా ఎమ్మెల్సీ ఎన్నికల్లో వీరు తమ ఓటు హక్కును వినియోగించుకుంటారని, ఓటర్ల జాబితాను స్థానిక ఎంపీడీఓ కార్యాలయ నోటీస్ బోర్డులో అతికించామని చెప్పారు. మండల కేంద్రం శిరివెళ్లలో 5, యర్రగుంట్ల, గోవిందపల్లెలో ఇద్దరు చొప్పున, కోటపాడు, మహదేవపురం, బోయలకుంట్ల, గంగవరం, చెన్నూరు, జీనేపల్లె, గుండంపాడు, గుంప్రమాన్ దిన్నెలలో ఒకరు చొప్పున ఎంపీటీసీలు, ఒక జెడ్పీటీసీ సభ్యుడు ఉన్నారని చెప్పారు. వీరు మార్చి 13న నంద్యాల ఆర్డీఓ కార్యాలయంలో తమ ఓటు హక్కును వినియోగించుకుంటారని, ఇప్పటికే ఓటర్లకు గుర్తింపు కార్డులు జారీ చేశామని వివరించారు.

### కత్తితో దాడి

ఆళ్లగడ్డ: పట్టణానికి చెందిన ఆశోక్, గురువయ్య అనే ఇద్దరిని నరసింహులు అనే వ్యక్తి కత్తితో దాడి చేసి గాయపరిచాడని ఎస్ఐ తిమ్మయ్య గురువారం తెలిపారు. ఏసునాథ పురానికి చెందిన నరసింహులు, శ్రీనివాసనగర్‌కు చెందిన అశోక్ ఆర్టీసీ బస్టాండు సమీపంలో డబ్బుల విషయంలో గొడవ పడుతుండగా నరసింహులు తన దగ్గరున్న కత్తితో అశోక్‌పై దాడి చేసేందుకు యత్నిస్తుండగా అక్కడే ఉన్న గురువయ్య అడ్డుకోబోగా.. నరసింహులు ఇద్దరినీ కత్తితో గాయపరిచాడు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ పేర్కొన్నారు.

### నేడు ఉచిత వైద్య శిబిరం

నంద్యాల(అర్బన్): స్థానిక సంజీవనగర్ సమీపంలోనున్న ప్రగతి ఆసుపత్రిలో శుక్రవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ఆసుపత్రి వైద్యులు శ్రీకాంత్, ప్రగతి తెలిపారు. గురువారం వారు మాట్లాడుతూ చెవి, ముక్కు, గొంతుకు సంబంధించిన అన్ని రకాల వైద్య సేవలు ఉచితంగా అందించడమే కాకుండా రూ.వెయ్యి విలువ గల వినికిడి పరీక్షలు, రూ.500 విలువజేసే చెవి, ముక్కు, గొంతు ఎండోస్కోపి పరీక్షలు ఉచితంగా చేస్తామని చెప్పారు. వివరాలకు సెల్: 8309525440 నంబరులో సంప్రదించాలని కోరారు.

### కౌలు రైతు ఆత్మహత్య



మృతి చెందిన శివశంకర్

ఆళ్లగడ్డ: చాగలమర్రి మండలం చిన్నవంగళి గ్రామంలో కౌలు రైతు శివశంకర్ (46) ఆత్మహత్య చేసుకున్నాడని ఎస్ఐ రమణయ్య గురువారం తెలిపారు. వివరాలు.. వైఎస్సార్ కడప జిల్లా కమలాపురానికి చెందిన శివశంకర్ కుటుంబం ఐదేళ్ల క్రితం చిన్నవంగళికి వలస వచ్చి ఇక్కడే కూలీ పనులు చేసుకుంటు జీవనం సాగిస్తున్నారు. అలాగే కొంత పొలం కౌలుకు తీసుకుని సాగు చేసుకునేవారు. ఈ క్రమంలో రెండేళ్ల నుంచి పంటల్లో నష్టం రావడంతో సుమారు రూ.ఐదు లక్షల వరకు అప్పులయ్యాయి. వాటిని తీర్చే దారి లేక ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడని భార్య వెంకటమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ వివరించారు.

### శ్రీకృష్ణదేవరాయలుకు నివాళి

నంద్యాల(వ్యవసాయం): శ్రీకృష్ణ దేవరాయలు స్వర్ణయుగ పాలనను అందించారని నంద్యాల జిల్లా బలిజ సంఘం అధ్యక్షుడు కామిని మల్లికార్జున్ తెలిపారు. శ్రీకృష్ణ దేవరాయల జయంతిని పుస్కరించుకొని స్థానిక సంఘం కార్యాలయంలో గురువారం కృష్ణదేవరాయల చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. నాయకులు పగిడి మధు, కొమ్మ హరి, రమణ, లింగమూర్తి, మల్లి పాల్గొన్నారు.

### రికార్డులు సక్రమంగా నిర్వహించాలి



మాచినేనిపల్లెలో రికార్డులను పరిశీలిస్తున్న సీడీపీఓ తేజస్విని

రుద్రవరం: రికార్డుల నిర్వాహణ సక్రమంగా లేకపోతే శాఖా పరమైన చర్యలు తీసుకుంటామని ఐసీడీఎస్ సీడీపీఓ తేజస్విని అంగన్‌వాడీ కేంద్రాల సిబ్బందిని హెచ్చరించారు. మండలంలోని ఆర్.కొత్తూరు, కొండమాయపల్లె, మాచినేనిపల్లె గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలను గురువారం తనిఖీ చేశారు. ఆయా కేంద్రాల్లో గ్రోత్, మెనూ తదితర వాటికి సంబంధించిన రికార్డుల నిర్వాహణ సక్రమంగా లేకపోవడాన్ని గుర్తించారు. ఎప్పటికప్పుడు సూచనలిస్తున్నప్పటికీ నిర్లక్ష్యం వహిస్తున్నారని కార్యకర్తలను మందలించారు. సూపర్‌వైజర్ లక్ష్మీదేవి ఉన్నారు.

## విద్యార్థులకు ఉపయోగపడే పుస్తకాలు ఇవ్వాలి



నోట్ పుస్తకాలు అందజేస్తున్న శిల్పా నాగినిరెడ్డి

నంద్యాల(అర్బన్): తమను కలవడానికి వచ్చే అభిమానులు, కార్యకర్తలు, నాయకులు, అధికారులు పూలమాలలకు బదులుగా పేద విద్యార్థులకు ఉపయోగపడే పుస్తకాలు తీసుకు రావాలని శిల్పా మహిళా సహకార్ చైర్‌పర్సన్ నాగినిరెడ్డి కోరారు. స్థానిక ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల విద్యార్థినులకు గురువారం దాదాపు 5వేల నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు. కళాశాల ప్రిన్సిపాల్ సోమశేఖరప్ప అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ విద్యాభివృద్ధి కోసం ప్రతి ఒక్కరూ సాయంచేస్తే పేద విద్యార్థులు ఉన్నత చదువులు చదుకొనే అవకాశం లభిస్తుందన్నారు. అనంతరం ఆమెను అధ్యాపకులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో 15వ వార్డు కౌన్సిలర్ సన్నల అనూషా రెడ్డి, డీఐఈఓ సునీత, వార్డు ఇన్‌చార్జ్ సాయిరాం రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కూటికోసం కోటి విద్యలు



ఒంటిపై బండను మోపి పగలగొడుతున్న దృశ్యం

దొర్నిపాడు: కూటి కోసం కోటి విద్యలు అన్నారు. అనంతపురం జిల్లా కదిరికి చెందిన త్యాగరాజు కుటుంబం పల్లెల్లో వీరబ్రహ్మేంద్ర స్వామి ప్రదర్శన పేరిట వివిధ సాహస కృత్యాలను ప్రదర్శించి పల్లె జనాలను అలరిస్తూ పొట్ట నింపుకుంటున్నారు. మండలంలోని క్రిష్టిపాడు గ్రామంలో రెండు రోజులుగా రాత్రి వేళల్లో సినిమా పాటలకు నృత్యాలు, నవ్వించే జోకర్ వేషం, మనిషిపై బండను మోపి పగలగొట్టడం, జీవ సమాధి, పడుకున్న మనిషిపై బైక్ నడపడం తదితర విన్యాసాలు ప్రదర్శిస్తున్నారు. రాత్రి ప్రదర్శన పూర్తి చేసుకొని ఉదయం ఇంటింటికి తిరిగి గ్రామస్తుల నుంచి ధాన్యం, ఆర్థిక సాయం అభ్యర్థిస్తారు.